## క్లుప్తంగా

### గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం రాజమండ్రికి చెందిన గోపాలకృష్ణ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

### వరసిద్ధుని సేవలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామి ప్రసాదం అందుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### కంటి ఆపరేషన్‌కు 61 మంది ఎంపిక




కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎస్‌వీ అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. పరీక్షించిన 129 మందిలో 61 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### జేబుదొంగలున్నారు జాగ్రత్త!



చౌడేపల్లె: బోయకొండలో భక్తుల రద్దీతో జేబుదొంగలు ఇటీవల కాలంలో చేతివాటం ప్రదర్శిస్తూ భక్తులను నిలువునా దోచేస్తున్నారు. ఈ ఘటనలపై అప్రమత్తమైన ఆలయ ఈఓ ఏకాంబరం, సీఐ కృష్ణారెడ్డి సమన్వయంతో బోయకొండలో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిఘా ముమ్మరం చేశారు. వాటితోపాటు జేబుదొంగల ముఖచిత్రాల ఫొటోలను ముద్రించి క్యూలు, జనసంద్రమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. భక్తులు జేబుదొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు జాగ్రత్తగా రక్షించుకోవాలని సీఐ, ఈఓ సూచనలిచ్చారు. ఎలాంటి అనుమానం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ఈరోజు

### రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహు కాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పూతలపట్టు: సోమవారం ఉదయం 10.30 గంటలకు తమ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పూతలపట్టు, ఐరాల తహసీల్దార్లు గుర్రప్ప, మహేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు, యువకులు తమ సమస్యలను అర్జీల రూపంలో మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువస్తే వారం వ్యవధిలో పరిష్కరిస్తామని తెలియజేశారు.

**కార్పొరేషన్ కార్యాలయంలో..**

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

**వేదగిరివారిపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'**

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని, గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


# మీ మెదడు జాగ్రత్త..!

మనిషిలోని ముఖ్యమైన అవయవాల్లో మెదడు ఒకటి. శరీరం మొత్తాన్ని నడిపే ఈ అవయవం ఆరోగ్యంగా ఉంటేనే శరీరం నియంత్రణలో ఉంటుంది. అయితే మెదడులో చిన్న సమస్య తలెత్తినా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసి జీవితాన్ని అతలాకుతలం చేస్తుంది. కోవిడ్ అనంతరం బ్రెయిన్‌స్ట్రోక్, హార్ట్ ఎటాక్ కేసులు పెరుగుతున్నాయని అధ్యయనాలు, ఆస్పత్రుల్లో రోగుల గణాంకాలు చెబుతున్నాయి.



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ చూస్తున్న దృశ్యం (ఫైల్)

- పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- కోవిడ్ అనంతరం పెరిగిన వైనం
- 'ఆరోగ్యశ్రీ' పథకం కింద సాధారణ చికిత్స నిల్
- ప్యాకేజీ సరిపోదని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేర్చుకునేందుకు నిరాకరణ
- ఆపరేషన్ అవసరమైన రోగులకు మాత్రమే చికిత్స



మెదడులో బ్లడ్ క్లాట్ అయితే ఇలా..

కాణిపాకం: మారుతున్న ప్రజల జీవనశైలి మూలాన రుగ్మతలు సైతం పెరుగుతున్నాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటితేనే అనారోగ్య సమస్యలు ఇబ్బందులు పెట్టేవి. ఇప్పుడలా కాదు. 25 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు స్ట్రోక్ బారిన పడుతున్నారు. చిన్న వయస్సు వారు స్ట్రోక్ బారిన పడటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్లు ఈ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు రంగంలోనూ ప్రస్తుతం 20 మందికి పైగా న్యూరాలజిస్టులు, 150 మందికి పైగా ఉన్న జనరల్ ఫిజీషియన్లు సైతం ఉన్నారు. దాదాపు 500 మంది వివిధ నరాల వ్యాధులతో చికిత్స నిమిత్తం వస్తున్నారు. వీరిలో 20 నుంచి 30 శాతం మంది స్ట్రోక్ (పక్షవాతం) బాధితులు ఉండటం గమనార్హం!

**కోవిడ్ వ్యాప్తితో పెరిగిన సంఖ్య**

కోవిడ్-19 అనంతరం పక్షవాతం బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కోవిడ్ కారణంగా మనిషి శరీరంలోని రక్తనాళాల్లో పలు చోట్ల రక్తం గడ్డలు (థ్రాంబోసిస్) కట్టుకుని ఉంటోందని, కొన్నిసార్లు ఇవి మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో బ్లాక్ కావడం వల్ల స్ట్రోక్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం)కు రక్తప్రసరణలో అవరోధం, నరాలు చిట్లడం ప్రధాన కారణాలు. మెదడుకు ఆక్సిజన్, పోషకాలు తీసుకెళ్లే రక్తనరాలు చిట్లడం, రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడటం వల్ల మెదడులోని ఆ భాగం కణ మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు కారణమవుతోందని, ఇటీవల చాలా మంది వారికి తెలియకుండానే దీని బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

**తక్షణ వైద్యమే రక్ష**

వ్యాధి లక్షణాలు కనిపించిన నాలుగున్నర గంటల్లో సమీప నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళితే చికిత్స వేగవంతంగా పొందింతే పక్షవాతం కలిగించే వైకల్యం సమస్య బారి నుంచి బైటపడవచ్చు. బ్రెయిన్ స్ట్రోక్ ఇస్కీమిక్ స్ట్రోక్, హెమరైజ్ స్ట్రోక్ అనే రెండు రకాలుగా వస్తుంది. మెదడులోని రక్తనాళాల్లో రక్తప్రసరణ సక్రమంగా లేకపోవడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలు చచ్చుబడిపోతాయి. దీన్నే ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని రక్తనాళాలు చిట్లినప్పుడు అంతర్లీనంగా రక్తస్రావమవుతుంది. దీన్నే హెరేజిక్ స్ట్రోక్ అంటారు. అయితే పక్షవాతం వచ్చిన రోగులకు నగరంలోని పలు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయడం లేదు. కేవలం ఒకటి, రెండు ఆసుపత్రుల్లో మాత్రమే స్ట్రోక్‌కు వైద్యం అందుతోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులు తమకు ప్యాకేజీ సరిపోదనే ఉద్దేశంతో రోగులను చేర్చుకోవడం లేదు. అయితే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో ఆపరేషన్ అవసరమైన రోగులను మాత్రమే వైద్య సేవ పథకం కింద నెట్‌వర్క్ ఆసుపత్రులు చేర్చుకుని ట్రీట్‌మెంట్ ఇస్తున్నాయి.

**బ్రెయిన్ స్ట్రోక్‌తో తీవ్రనష్టం**

మెదడుకు వెళ్లే రక్తం సరఫరాలో అంతరాయం కలిగితే మెదడు పనితీరు క్షీణించి స్ట్రోక్ వస్తుంది. 85 శాతం మందికి కాళ్లు, చేతులు, చచ్చుపడిపోవడం, కొందరికి మూతి వంకరపోవడం, మాట నత్తిగా రావడం, మాట్లాడలేకపోవడం, కళ్లు మసకబారడం, చూపు కోల్పోవడం వంటివి జరుగుతాయి. 15 శాతం మందిలో మాత్రమే మెదడులో నరాలు చిట్లిపోయి అంతర్గత రక్తస్రావం అవుతుంది.

**లక్షణాలు ఇలా...**

- అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం.
- అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు తలెత్తడం.
- నడవడానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం.
- ఎలాంటి కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి.

**కారణాలు**

- యువతలో స్ట్రోక్ కారణాలు పనిలో ఒత్తిడి, స్మోకింగ్, మద్యపానం అలవాట్లు.
- జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, మధుమేహం, రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి ఎక్కువగా ఉండటం, ఊబకాయం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- అన్యూరిజం వంటి శరీర నిర్మాణ లోపాలు, పుట్టుకతో జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డకట్టే గుణం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది.
- గుండెజబ్బులున్న వారికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు.

**నిర్లక్ష్యం చేయొద్దు**



బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి తీసుకొస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. థ్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. ఇది వెంటనే నరాల్లో గడ్డకట్టిన రక్తాన్ని పలుచన చేసి మెదడుకు రక్త సరఫరాను పునరుద్ధరిస్తుంది. ఆ తర్వాత వస్తే మాత్రం మెదడులో న్యూరాన్స్ తగ్గిపోతాయి. ఈ కారణంగా మెదడుకు రక్తసరఫరా తగ్గిపోయి ఇబ్బంది కలుగుతుంది. ఒకసారి స్ట్రోక్‌కు గురైన వారు రెండోసారి రాకుండా జాగ్రత్త పడాలి, సక్రమంగా మందులు వాడుతూ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి.

–కల్యాణ్‌బాబు, న్యూరోసర్జన్, చిత్తూరు

### నేటి నుంచి ఉత్సవాలు

తవణంపల్లె: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. తొలిరోజు సోమవారం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పిస్తామన్నారు. ఉదయం 9.15 గంటలకు గో పూజ, ఉభయదారులతో ఉత్సవమూర్తులకు అభిషేకం, ఊరేగింపు, తులసి, ఉసిరి చెట్లకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంకాలం పుష్పయాగ మహోత్సవానికి అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

### మోటార్ సైకిళ్లు ఢీ ఇద్దరికి గాయాలు

ఐరాల: మితిమీరిన వేగంతో వెళ్తూ మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ఎం.పైపల్లె వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్ఐ ధరణిధర కథనం మేరకు.. ముదిగోళంకు చెందిన రాము జనరేటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాము బైక్‌లో ఉదయం తిరుపతి నుంచి ఐరాలకు వెళ్తుండగా, అదే సమయంలో పృథ్వీరాజ్ బైక్‌లో వైఎస్.గేటు నుంచి ముదిగోళంకు బయలుదేరాడు. ఎం.పైపల్లె వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన సదస్సు రేపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం బ్యాంకు ఖాతాలపై జరుగుతున్న సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఐ రీజినల్ చీఫ్ మేనేజర్ భవాని తెలిపారు. పుంగనూరులోని కొత్త ఇండ్లు సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఖాతాదారులు ఈ సదస్సు హాజరు కావాలని కోరారు.

## విష రహిత ఆహారోత్పత్తులు అందించడమే లక్ష్యం



జిల్లేడుపల్లెలో క్షేత్ర స్థాయి పర్యటనలో వ్యవసాయాధికారులు, ఏపీసీఎన్‌ఎఫ్ సభ్యులు

- డీపీఎం వాసు

బంగారుపాళెం: ప్రకృతి వ్యవసాయంతో సమాజానికి విష రహిత ఆహారోత్పత్తులు అందించడమే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్‌ఎఫ్) లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. జిల్లాలో ఏపీసీఎన్‌ఎఫ్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఆదివారం మండలంలోని జిల్లేడుపల్లెలో మెంటర్ చంద్రకళ పొలంలో సాగు చేస్తున్న ఏ గ్రేడ్, డ్రాట్ ప్రూఫింగ్, డీఆర్‌ఎస్, సూర్యమండలం (న్యూట్రి గార్డెన్) ప్లాట్‌లను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు వినియోగించే ఎరువులు, కషాయాల తయారీని ప్రదర్శనపూర్వకంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే కలిగే ప్రయోజనాలు, లాభాలను తెలియజేశారు. వాసు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న చిన్నకారు రైతులు, మహిళా సంఘాల ప్రేరణాశక్తికి నిదర్శనమన్నారు. ప్రకృతి వ్యవసాయంతో జీవనోపాధి మెరుగుపరచుకోవడమే కాకుండా ఆహారం, పోషక విలువల భద్రతకు ఏపీసీఎన్‌ఎఫ్ భరోసా కల్పిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ టీం కో–ఆర్డినేటర్ మీరాబీ, నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్లు, ట్రైనింగ్ సభ్యులు పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బంగారుపాళెం: మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళెం కమిటీ–1,2 సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షులు బాలాజీ, ధనుంజయ మాట్లాడారు. సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో కుల మత బేధాలు లేకుండా, ప్రజల మధ్య అసమానతలను రూపుమాపడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

## అయ్యప్పస్వామికి ఇరుముడులు





ఇరుముడులు కడుతున్న అయ్యప్పభక్తులు, వీధుల్లో ఇరుముడులు తీసుకువెళ్తున్న అయ్యప్ప భక్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో అయ్యప్పస్వామి ఇరుముడుల కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం గ్రామ మధ్యలో అరటి బోదెలు, అరటిపూలతో అందంగా అలంకరించి పడికట్ల పూజ చేశారు. గురుస్వాములు వాసు, సాంబశివం ఆధ్వర్యంలో 34మంది అయ్యప్ప భక్తులకు ఇరుముడులను ధరింపజేశారు. అయ్యప్పఘోషను నినదిస్తూ, భక్తిపాటలు పాడుతూ, శబరిమలైకు బయలుదేరారు. గ్రామంలో అన్ని ఇళ్లను మహిళలు శుద్ధి చేసి, అయ్యప్పస్వామిని పూజించారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

- ఒకరి అరెస్ట్

పుంగనూరు: చౌడేపల్లె మండలంలోని తిరుమనపల్లె వద్ద కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న స్వతంత్రయ్యను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దాడులు జరిపామన్నారు. దాడుల్లో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న స్వతంత్రయ్యను పట్టుకుని కేసు నమోదు చేసి,అరెస్ట్ చేశామన్నారు.

# ప్రారంభం ఆర్భాటం.. ముగింపు నీరసం!



బస్సు కోసం నిరీక్షిస్తున్న క్రీడాకారులు

- రాష్ట్ర స్థాయి క్రీడల ముగింపులో పత్తా లేని జిల్లా స్థాయి అధికారులు
- నిరుత్సాహానికి గురైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు



రవాణా సౌకర్యం లేక చిత్తూరు రైల్వే స్టేషన్‌కు ప్యాసింజర్ ఆటోలో వెళ్తున్న క్రీడాకారులు

తవణంపల్లె: జిల్లా పాఠశాల విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరగొండ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్–14 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి.13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడా జట్లలో ప్రతిభ చాటి విన్నర్స్, రన్నర్స్, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలను ప్రదానం చేసేందుకు జిల్లా స్థాయి అధికారులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో క్రీడాకారులు, పీడీలు, కోచ్‌లు, మేనేజర్లు నిరాశకు గురయ్యారు. ప్రారంభం రోజున జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆర్భాటంగా క్రీడలను ప్రారంభించి అధికారులు ముగింపు రోజున మాత్రం క్రీడాకారుల్లో స్ఫూర్తినింపేందుకు అటు జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర ఉన్నతాధికారులు, కనీసం క్రీడలకు సంబంధించిన అధికారులుగానీ ఒక్కరంటే ఒక్కరూ రాకపోవడం..కేవలం ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా అధికారులకు క్రీడలపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో ఇది తేటతెల్లం చేసింది. పైగా, క్రీడాకారులు చిత్తూరుకు వెళ్లడానికి సకాలంలో బస్సులు లేక ఆటోలను ఆశ్రయించారు. ఇబ్బందుల నడుమ బయల్దేరారు.



రాష్ట్ర స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విజయనగరం బాలుర జట్టు



అరగొండ క్రీడామైదానంలో గుంటూరు జట్టుతో తలపడుతున్న విజయనగం బాలుర జట్టు







సాఫ్ట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకున్న చిత్తూరు బాలికల జట్టు, బాలికల విభాగంలో అండర్-14 ద్వితీయ స్థానం దక్కించుకున్న విజయనగరం జిల్లా బాలికల జట్టు, తృతీయ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జిల్లా బాలికల జట్టు